











కణేకల్లు మండలం ఉడేగోళంలో మస్టర్ రోల్ 3826కు ఐదు రోజుల పాటు ఒకే ఫోటోలు అప్‌లోడ్ చేసిన దృశ్యాలు

**నిబంధనల ప్రకారం పని ప్రదేశాల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. కానీ ఇళ్ల వద్ద ఒక సారి ఫొటోలు తీసుకుని అవే ఫొటోలను ప్రతి రోజూ అప్‌లోడ్ చేస్తూ నిధులు కాజేస్తున్న పరిస్థితి**

# ఉడేగోళంలో మాయాజాలం




కణేకల్లు మండలం ఉడేగోళంలో మస్టర్ రోల్ 3829కు ఈనెల 12, 13, 14, 15, 16వ తేదీల్లో ఐదు రోజుల పాటు ఒకే ఫోటోలు అప్‌లోడ్

**మనస్సాక్షి, కణేకల్లు :**

ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. అధికార పార్టీ అండదండలతో చెలరేగిపోతున్నారు. నకిలీ మస్టర్లు వేసి వేతనదారులు పనులకు రాకపోయినా బిల్లులు కాజేస్తున్నారు. కణేకల్లు మండలంలోని ఉడేగోళంలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఉడేగోళం పంచాయతీలో పొలాలకు నీటిని పారించడానికి/నీటిని మళ్లించడానికి "పొలం గట్టు వెంట కాలువ" తీసే పనికోసం 32 మందితో నాలుగు మస్టర్లు ( నంబర్ 2826, 3827, 2828, 3829) వేశారు. ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పని కల్పించినట్లు చూపి ప్రతి రోజూ ఒకే ఫొటోను అప్‌లోడ్ చేశారు. నిబంధనల ప్రకారం పని ప్రదేశంలో వేతనదారుల ఫొటోలను ఉదయం ఒకసారి, పని ముగిశాక మరోసారి తీసి అప్‌లోడ్ చేయాలి. కానీ సాంకేతికతను కూడా బురిడీకొట్టిస్తూ నిధులు కాజేసే ప్లాన్ వేశాడు ఇక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్..! ఇతడికి స్థానిక టీడీపీ నాయకులతో పాటు అధికారులు కూడా సహకారం అందిస్తుండడంతో యథేచ్ఛగా దోపిడీ కొనసాగిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. కేవలం ఈ నాలుగు మస్టర్లు మాత్రమే కాకుండా ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున నకిలీ మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశాడు. ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు 13 పనులకు గాను 50కి పైగా మస్టర్లు వేశాడు. నిత్యం 250 నుంచి 300 మంది వరకు పనులు చూపాడు. ఇందులో సగం నకిలీ మస్టర్లు కావడం గమనార్హం. ప్రతి రోజూ మస్టర్లు తనిఖీ చేయాల్సిన అధికారులు వాటాలకు అలవాటు పడి అటు వైపు చూడడం లేదు. మస్టర్ల మేరకు పనులు జరుగుతున్నాయా? లేదా? అని పరిశీలించాల్సిన పంచాయతీ సెక్రటరీ, ఏపీఓ, ఇతర అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఉపాధి లక్ష్యం నీరుగారుతోంది. జిల్లా ఉన్నతాధికారులకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతి వ్యవహారం తెలిసినా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిత్యం పంచాయతీ పరిధిలో వేసిన మస్టర్లకు సంబంధించి ఫొటోలను పరిశీలించాల్సి ఉన్నా అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కేవలం ఈ నాలుగు మస్టర్లకు సంబంధించే కాకుండా ఏడాది కాలంగా ఉడేగోళంలో పెద్ద ఎత్తున బోగస్ మస్టర్లు వేసినట్లు తెలుస్తోంది.

- **ఉపాధి హామీ పనుల్లో అవినీతి కాలువ**
- **పనులకు వెళ్లకపోయినా ఖాతాల్లోకి నిధులు**
- **పాత ఫొటోలు అప్‌లోడ్ చేసి దోపిడీ పర్వం**
- **టీడీపీ నేతలు, అధికారులకు వాటాలు..!**
- **క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించని వైనం**







కణేకల్లు మండలం ఉడేగోళంలో మస్టర్ రోల్ 3828కు ఒకే ఫోటోలు అప్‌లోడ్ చేసిన దృశ్యాలు












కణేకల్లు మండలం ఉడేగోళంలో మస్టర్ రోల్ 3827కు ఐదు రోజుల పాటు ఒకే ఫోటోలు అప్‌లోడ్ చేసిన దృశ్యాలు

**ఉడేగోళంలో గడిచిన 10 రోజులుగా 2 వేలకు పైగా పనిదినాలు కల్పించినట్లు నమోదు చేసి సగం మంది కూడా పనులకు రాకపోయినా పెద్ద ఎత్తున నిధులు స్వాహా.. సమగ్ర విచారణ చేస్తే దోపిడీ వెలుగులోకి**

## అర్హులకు విరివిగా రుణాలు అందించాలి


**మనస్సాక్షి, అనంతపురం :** అర్హులైన లబ్ధిదారులకు వివిధ ప్రభుత్వ పథకాల పై బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించి వారి ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని , అలాగే 100 శాతం లక్ష్యసాధన జరగాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం మరియు జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం (బ్యాంకర్ల సమావేశం )జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలులో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలక మైనదన్నారు. పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా అర్హత కలిగిన లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి కేటాయించిన రుణాల లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తిస్థాయిలో ఖచ్చితంగా చేరుకోవాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. ఆయా ప్రభుత్వ పథకాలకు సంబంధించిరుణాలమంజూరులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలుతీసుకుంటామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్ హెచ్ జి లకు రుణాల మంజూరు లక్ష్యంలో ప్రగతిని సాధించాలన్నారు. ప్రధానమంత్రి ముద్ర రుణాలకు సంబంధించి 2025-26లో 56 ,81 8 గాను 8 6 3 .6 కోట్లు లక్ష్యానికి గాను 42 8 2 8 మందికి సుమారు రూ. 7 9 5 3 5 కోట్లు ఈ సంవత్సరం మార్చి 31 నాటికి రుణాలు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మిగిలిన లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. రుణాల మంజూరులో ఎలాంటి పురోగతి లేని బ్యాంకర్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించమన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద 63 30 మంది దరఖాస్తులు అందించగా, అందులో 33 31 దరఖాస్తుల మంజూరు కాగా 67.22కోట్లరూపాయలుపంపిణీ చేయడం జరగగా, మరో 27 28 మందికి 43. 59 కోట్లు వారి ఖాతాలోకి జమ చేయడం జరిగిందన్నారు. ఇంకా ఏవైనా పెండింగులు ఉంటే గ్రౌండింగ్ చేసి మంజూరు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రైవేటు బ్యాంకుల్లో మంజూరు కానీ దరఖాస్తులను ఎస్ బి ఐ కు బదిలీ చేయాలని ఆదేశించారు. అంతేగాక బ్యాంకర్ల స్థాయిలో వివిధ కారణాల వల్ల పెండింగ్ ఉన్నచో వెంటనే రుణాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, ఎల్డీఎంలు కలిసి పెండింగ్ దరఖాస్తులకు రుణాల పంపిణీ కోసం దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఐదువేలకు పైగా ఉన్న గ్రామాలకు సంబంధించి బ్యాంకులు లేని గ్రామాల్లో బ్యాంకులను ఏర్పాటు చేయాలని, ప్రతిపాదించిన గ్రామాల్లో అవకాశం ఉన్నచోట బ్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు. పీఎం స్వానిధి పథకం కింద అధికారులు బ్యాంకులకు దరఖాస్తులను అందజేయడం జరగగా, బ్యాంకుల్లో పెండింగ్ ఉన్నాయని, అర్హత ఉన్న వాటికి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. పీఎంఈజీపీ కింద వచ్చిన దరఖాస్తులలో పెండింగ్ ఉన్న దరఖాస్తుల్లో నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను పీఎంఎఫ్ఎంఈ కింద వాల్యూ ఎడిషన్ ఏర్పాటు కోసం పంపించాలన్నారు. డిఆర్డీఏ పిడి, మెప్మా పిడి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, హార్టికల్చర్ అధికారులు వారి పరిధిలో ఆయా పథకాలకు బ్యాంకుల వారిగా పంపించిన వివరాలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. పలువురు బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవడంలో పురోగతి తక్కువగా ఉందని, వెంటనే పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. బ్యాంకర్లు ఆయా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేయడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎల్.డి.ఎం శ్రీనివాసులు ఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఏడిసిసి జిల్లా పరిశ్రమల శ్రీనివాసరావు, డిఆర్డీఏ పిడి శైలజ, పశు సంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధారాలుంటే ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తాం

- **‘మనస్సాక్షి’ కథనాలతో ఉపాధి అక్రమార్కుల్లో వణుకు**
- **ఉడేగోళంలో విచారణకు వెళ్లిన కణేకల్లు ఎంపీడీఓ విజయసింహారెడ్డి**
- **40 మందిని సచివాలయం వద్దకు పిలిపించి తాము పనిచేస్తుంటేనే బిల్లులు పడుతున్నాయని చెప్పించిన ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, టీడీపీ నేత మారుతి**
- **ఉడేగోళంలో నిత్యం 250 మందికి పైగా పనులు చేస్తున్నట్లు రికార్డులు**
- **క్షేత్రస్థాయికి వెళ్లి పనులు పరిశీలించని అధికారులు**
- **ఉడేగోళం మాజీ సర్పంచ్ భర్త, టీడీపీ నేత మారుతి ప్రసాద్**




కణేకల్లు మండలం ఉడేగోళంలో జరుగుతున్న ఉపాధి అవినీతిపై ‘మనస్సాక్షి’ కథనాలు



సచివాలయం వద్ద ఉపాధి కూలీలతో ఎంపీడీఓ, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, టీడీపీ నేత మారుతి

**మనస్సాక్షి, కణేకల్లు :**

ప్రభుత్వ శాఖలో అవినీతి జరిగినట్లు తెలిస్తే సంబంధిత సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. కానీ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండలంలో మాత్రం టీడీపీ నాయకులే చర్యలు తీసుకుంటారు. విధుల్లోంచి తొలగించేస్తారు..! ఇదంతా నిజమా? అంటే అవును నిజమే..! సాక్షాత్తూ ఉడేగోళం మాజీ సర్పంచ్ లావణ్య భర్త, టీడీపీ నేత మారుతి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలివి. వివరాల్లోకి వెళితే... కణేకల్లు మండలంలోని ఉడేగోళంలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతి వ్యవహారంపై ‘మనస్సాక్షి’లో కథనాలు వచ్చాయి. “ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ల దోపిడీ”.. “పచ్చనేత..ఉపాధి మేత’ శీర్షికలతో వార్తలు రావడంతో అక్రమార్కులు ఉలిక్కిపడ్డారు. ఉపాధి పేరుతో కూలీల సొమ్మును కాజేస్తున్న వైనం బహిర్గతం కావడంతో ‘గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు’ ఉడేగోళం మాజీ సర్పంచ్ భర్త, టీడీపీ నాయకుడు మారుతి ప్రసాద్ రంగంలోకి దిగాడు. ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ అవినీతి చేయడం లేదంటూ సర్టిఫికెట్ ఇచ్చాడు. “మనస్సాక్షి” కథనాలపై స్పందించిన ఎంపీడీఓ విజయసింహారెడ్డి రంగంలోకి దిగడంతో అక్రమాలను కప్పిపుచ్చేందుకు నానా పాట్లు పడ్డాడు. గురువారం ఉడేగోళంకు ఎంపీడీఓ విజయసింహారెడ్డి వస్తున్నారన్న సమాచారం తెలియగానే ఓ 40 మంది ఉపాధి కూలీలను సచివాలయం వద్దకు రావాలని ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి పురమాయించాడు. అదే తడువుగా కొందరు ఉపాధి వేతనదారులు సచివాలయం వద్దకు చేరుకోగానే ఎంపీడీఓతో కలిసి ఓ ఫోటో తీయించాడు. తాము ఉపాధి పనులకు వెళ్తుంటేనే వేతనాలు పడుతున్నాయంటూ వారితో చెప్పించాడు. కథ ఇక్కడితో ఆగలేదు. ఎంపీడీఓ వెళ్లిపోగానే ఓ వీడియోను టీడీపీ నేత మారుతి రిలీజ్ చేశాడు. అందులో ఏముందంటే..“ నీతి నిజాయితీ ఉన్న పార్టీలో.. కాలవ శ్రీనివాసులు వద్ద మేం పని చేస్తున్నాం. ఆయన కూడా ఒక జర్నలిస్టు. ఆయన ఇప్పుడు ఏ హోదాలో ఉన్నాడో చూడండి. ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఉపేక్షించము. విలేకరుల వృత్తి సమాజానికి ఉపయోగపడేది. నా ఫేస్‌బుక్ ఐడీలో నేను ఫొటోలు పెట్టుకుంటే ఆ ఫొటో తీసుకుని ఎమ్మెల్యే ఉన్న ఫొటోను మీ కథనంలో వాడతారా? ఈరోజు ఎంపీడీఓ విచారణ చేశారు. మాకు అన్యాయం జరిగిందని ఎవరూ చెప్పలేదు. ‘మనస్సాక్షి’ విలేకరిపై పరువు నష్టం దావా వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు చెప్పాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. ఆధారాలు లేకుండా వార్తలు రాశారు. తప్పుడు రాతలు రాస్తే చట్టపరంగా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. మీ సహచరులు (ఇతర పత్రికల జర్నలిస్టులు) ఎలా ప్రవర్తిస్తున్నారో చూసి నేర్చుకోండి” అని తెలియజేశారు.

**ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే మాజీ సర్పంచ్ లావణ్య, ఆమె భర్త మారుతిలకు ఉడేగోళంలో జాబ్ కార్డులున్నాయి. రెండేళ్లుగా ఉపాధి నిధులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి.**

Printed, published and owned by Mahammad Munvar Basha, Printed at M/S Anju Publications, #19-2-710, Rajamma Nagar, Old Town, Ananthapuramu - 515001, Ananthapuramu Dist., Andhra Pradesh. Published at #19-2-710, Rajamma Nagar, Old Town, Ananthapuramu - 515001, Ananthapuramu Dist., Andhra Pradesh. Editor : MAHAMMAD MUNVAR BASHA. RNI No. APTEL/2020/80172 , E-mail : manassakshidaily@gmail.com